క్లుప్తంగా

నరసాపురం బస్టాండ్‌లో వాటర్ ప్లాంట్ ఏర్పాటు



వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న దృశ్యం

నరసాపురం: స్థానిక బస్టాండ్‌లో ప్రయాణికుల కోసం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. శుక్రవారం ప్లాంట్‌ను ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోటరీ క్లబ్ సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ఆర్డీవో దాసి రాజు మాట్లాడుతూ ప్రయాణికులకు శుభ్రమైన మంచినీరు అందించాలని సూచించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఎస్.సుబ్బన్నరెడ్డి, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గన్నాబత్తుల సత్యవతి, బొమ్మిడి సూర్యకుమారి, ఆత్మూరి రమ, కోట్ల రామ్ కుమార్ పాల్గొన్నారు.

ఎస్ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థులు


యడ్ల స్రవంతి

పాలకొల్లు సెంట్రల్: పోడూరు మండలంలోని వద్దిపర్రు గ్రామం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థిని యడ్ల స్రవంతి నేషనల్ మీన్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎస్ఎంఎంఎస్)కు ఎంపికైనట్లు శుక్రవారం ప్రధానోపాధ్యాయురాలు నిరోగి రమ తెలిపారు. విద్యార్థిని తల్లిదండ్రులు శ్రీనివాస్, మల్లేశ్వరి వీరిది వ్యవసాయ కుటుంబమని వివరించారు. మండల విద్యాశాఖాధికారులు గుణ్ణం విజయ్ కుమార్, జీవీ సూర్యనారాయణ, వద్దిపర్రు సర్పంచ్ వడ్లపాటి రాజేంద్ర ప్రసాద్, ఎంపీటీసీ సభ్యురాలు విప్పర్తి శారద, ఎస్ఎంసీచైర్మన్ పాతగొలుసు విజయలక్ష్మి తదితరులు విద్యార్థినిని అభినందించారు.

మట్లపాలెంలో..


యలమంచిలి: మట్లపాలెం గ్రామంలోని పేరిచర్ల సుబ్బరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఈ ఏడాది ఏడుగురు విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పీబీ పద్మిని కుమారి తెలిపారు. స్కాలర్‌షిప్ సాధించిన వారిలో గాడి దివ్య శ్రీ, కట్టా శ్రీ లేఖ, విశ్వనాథపల్లి శరణ్య, గుబ్బల ఓం కిరణ్, రావి శ్రీక్రాంతి, సిర్రా దుష్యంత్, వైదాని మాలశ్రీ ఉన్నారు. ఈ పాఠశాల విద్యార్థులు 2017 నుంచి ఇంతవరకు 40 మంది ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపిక కాగా ఈ ఏడుగురితో ఆ సంఖ్య 47కు చేరుకుంది

జీవహింస చట్టరీత్యా నేరం


జీవహింస నేరంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: జీవహింస నిషేధమని ఎవరైనా ఆవులు, దూడలు, ఒంటెలను వధిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ జి.మల్లేశ్వరరావు అన్నారు. శుక్రవారం పట్టణంలో పశుసంవర్ధశాఖ ఆధ్వర్యంలో స్థానిక వెటర్నరీ ఆసుపత్రి వైద్యులు, వైద్య సిబ్బంది జీవహింస నిషేధపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. స్థానిక యడ్లబజారు సెంటర్ వెటర్నరీ ఆసుపత్రి నుంచొ పెదగోపురం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాలకొల్లు, యలమంచిలి మండల పశువైద్యాధికారులు పి.చంద్రశేఖర్ రెడ్డి, వరప్రసాద్, ఎస్పీసీఏ రాష్ట్రస్థాయి సభ్యులు మోటూరి మణికంఠ, మెంబర్లు నవీన్, సుబ్బారావు, క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాస్, ఎల్ఎస్ఎ సత్తి సతీష్ రెడ్డి,దుర్గారావు, జోగేశ్వరరావు, ధనరాజు తదితరులు పాల్గొన్నారు.

చాంబర్స్ జూనియర్ కళాశాల విద్యార్థికి ప్రతిభ అవార్డు


విద్యార్థిని అభినందిస్తున్న చైర్మన్, ప్రిన్సిపాల్

పాలకొల్లు సెంట్రల్: పేద మధ్యతరగతి విద్యార్థులకు అందుబాటులో ఉండేలా తమ విద్యా సంస్థ మెరుగైన విద్యను అందిస్తుందని చాంబర్స్ కళాశాల చైర్మన్ కారుమూరి వెంకట నరసింహరావు అన్నారు. శుక్రవారం కళాశాలలో చైర్మన్ ఛాంబర్ నందు ఇంటర్మీడియట్ 2023–25 విద్యా సంవత్సరానికి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 966 మార్కులతో స్టేట్ 4వ ర్యాంకు సాధించిన విద్యార్థి ఐ.లక్ష్మణ్ వర్షిత్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిభ అవార్డుకు ఎంపిక చేసింది. ఈ సందర్భంగా చైర్మన్ నరసింహరావు మాట్లాడుతూ తమ విద్యార్థి లక్ష్మణ్ స్టేట్ 4వ ర్యాంకు సాధించి రాష్ట్ర ప్రతిభా పురస్కారానికి ఎంపికై కళాశాలకు, క్షీరపురికి మంచి గుర్తింపు తీసుకువచ్చాడన్నారు. అనంతరం కళాశాల సెక్రటరీ కె.సీతారామరాజు, ట్రెజరర్ ప్రవీణ్‌భాను, ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.నరసింహరావు, డాక్టర ఎబీఎస్ మూర్తి, ఎస్ సీతారామారావు తదితరులు విద్యార్థిని అభినందించారు.

గ్రంథాలయాల్లో ముగిసిన వేసవి శిబిరాలు

ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు


ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు


నరసాపురం గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతులకు హాజరైన విద్యార్థులు (ఫైల్)


శిక్షణ తరగతుల్లో భాగంగా డ్యాన్స్ నేర్చుకుంటున్న విద్యార్థులు (ఫైల్)

నరసాపురం రూరల్: ఇటీవల కాలంలో విద్యార్థులకు పుస్తక పఠనంపై ఆసక్తి తగ్గిపోతుంది. ముఖ్యంగా స్మార్ట్‌ఫోన్స్ వాడకం వల్ల పిల్లల మేధోశక్తి తగ్గిపోతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో వేసవిలో విద్యార్థులకు ఫోన్లకు దూరంగా ఉంచడంతో పాటు వారికి వివిధ అంశాల్లో తర్ఫీదు ఇవ్వడానికి గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహించారు. విద్యార్థులకు ప్రత్యేక వేసవి శిక్షణ శిబిరాల ద్వారా విజ్ఞానాన్ని అందించే కార్యక్రమాలు దిగ్విజయంగా పూర్తయ్యాయి. సెలవులను సద్వినియోగం చేసుకుని విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీసేందుకు ఈ శిబిరాలు దోహదపడ్డాయి. పుస్తక పఠనంపై ఆసక్తి కల్పించేందుకు నరసాపురం శాఖ గ్రంథాలయంలో ఏప్రిల్ 28న ప్రారంభమైన శిబిరం జూన్ 6 వరకు కొనసాగింది. రోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తరగతులు జరిగాయి. విజ్ఞానం, వినోదం, సాహిత్యం, చిత్రలేఖనం, కథారచన, కథలు చెప్పడం, నృత్యం, ఆంగ్ల భాష, భావ వ్యక్తీకరణ తదితర అంశాలలో పట్టు సాధించేలా ఈశిబిరంలో విద్యార్థులను తీర్చిదిద్దారు.

ఆసక్తి కలిగేలా..

ఈ శిబిరాల్లో పిల్లలకు ఆసక్తి కలిగించే పలు పుస్తకాలు అందుబాటులో ఉంచారు. బాల సాహిత్యం, దేశనాయకులు జీవిత చరిత్రలు, దేశభక్తిని పెంపొందించే పుస్తకాలు చదవడానికి ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు వారిచే కథలు చదివించడం, చెప్పించడం, రాయించడం వంటి కార్యాక్రమాలు నిర్వహించారు. శిబిరానికి రాగానే నచ్చిన పుస్తకాన్ని చదివిన తర్వాత మిగిలిన తరగతులు ప్రారంభించేలా ప్లాన్ చేశారు. స్టోరీ టెల్లింగ్ (ఆకట్టుకునేలా కథలు చెప్పడం) నీతి కథలు, మానవీయ ప్రవర్తన, ఎదుట వ్యక్తిని ఆకట్టుకునేలా కథలు చెప్పడం, ధ్యానం, యోగా తదితర అంశాల్లో తర్ఫీదుఇచ్చారు. చిత్రలేఖనం, పేపర్ క్రాఫ్ట్, పాటలు పాడటం, నత్యం, కరాటే తదితర అంశాల్లో నిపుణులు, విశ్రాంత ఉపాధ్యాయులతో తరగతులు చెప్పించారు. పలువురు దాతలు శిబిరానికి హాజరైన విద్యార్థులకు బిస్కెట్లు, తినుబండరాలు, చాక్లెట్లు, అరిపండ్లు అందించారు.

చివరి రోజు కార్యక్రమం ఇలా..

నరసాపురం: పట్టణంలోని గ్రేడ్–1శాఖ గ్రంథాలయంలో గత 40 రోజులుగా జరుగుతున్న వేసవి శిక్షణా శిబిరాలు గురువారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న గ్రంథాలయ కమిటీ అధ్యక్షుడు పండా నాగేంద్రత్రినాథ్ మాట్లాడుతూ గ్రంథాలయాలను మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ పుస్తకాలు చదవాలని, పిల్లల తల్లితండ్రులు పుస్తక పఠనంపై పిల్లల్లో అవగాహన కల్పించాలని అన్నారు. వైఎస్ కళాశాల ఉపాధ్యక్షుడు డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా విజ్ఞానవంతులు అవుతారన్నారు. లైబ్రేరియన్ కేజేఎస్ఎల్ కుమారి కృషిని అభినందించారు. 40 రోజుల పాటు వివిధ అంశాల్లో నిర్వహించని పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో రిటైర్డ్ శాస్త్రవేత్త ఆర్.సుబ్బారావు, డాక్టర్ ఎస్. రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంపై ఆసక్తి పెంపు



ప్రత్యేక తరగతులతో ఎంతో నేర్చుకున్నారు. ఈ వేసవి శిక్షణ శిబిరానికి నిపుణులు, విశ్రాంత ఉపాధ్యాయులు, పలువురు ప్రముఖులు వచ్చి ప్రత్యేక తరగతులు తీసుకున్నారు. విద్యార్థులకు పుస్తక పఠనంపై ఆసక్తి కలిగించడంలో సఫలీకృతులమయ్యాం. అలాగే కొత్త విషయాలను పిల్లలకు నేర్పించాం. చదువుకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల భవిష్యత్‌లో కలిగే ప్రయోజనాలను వివరించాం.

– కేజేఎల్ కుమారి, గ్రంథాలయాధికారి, నరసాపురం

చిత్రలేఖనంపై ఆసక్తి



చిత్రలేఖనం పై నాకు ఉన్న ఆసక్తితో శిక్షణకు వెళ్లాను. వివిధరకాల బొమ్మలు వేయడం నేర్చుకున్నాను. పేపరుతో పలు రకాల ఆకృతులు తయారు చేయడం నేర్చుకున్నాను. ఇంగ్లిషు, సైన్సు తదితర అంశాలపై కూడా వివరించారు. ఇవి భవిష్యత్‌లోమాకు ఎంతో ఉపయోగపడతాయి.

– బాణ శ్రావణి, 8వ తరగతి, రాయిపేట

కథలంటే ఎంతో ఇష్టం



నాకు కథలంటే ఎంతో ఇష్టం. ఇక్కడ ఎంతో ఆసక్తి కలిగించేలా ఎన్నో కథలు చెప్పారు. అలాగే కాగితం తో బొమ్మలు తయారు చేయడం, చిత్రలేఖనం నేర్చుకున్నాను. సులభంగా బొమ్మలు ఎలా గీయాలో శిక్షణ ఇచ్చారు. వాటి మెళకువలు తెలుసుకోవడం ఆనందంగా ఉంది.

– కటకంశెట్టి లాస్యగౌరి, 9వ తరగతి. నరసాపురం

చాలా బాగున్నాయి



వేసవి శిక్షణ తరగతులు చాలా బాగున్నాయి. ఎన్నో కొత్త విషయాలను తెలుసుకున్నాను. నా స్నేహితులతో కలిసి చిత్రలేఖనం, ఇంగ్లిషు నేర్చుకున్నాను, వేసవి సెలవులను బాగా ఎంజాయ్ చేశాను. కరాటే, యోగా, ధ్యానం వంటి పలు అంశాలల్లో బాగా పట్టు సాధించాను.

– దివి సందీప్, 7వ తరగతి, రుస్తుంబాద

లక్ష్మీ నరసింహస్వామికి పల్లకి సమర్పణ


లక్ష్మీ నరసింహస్వామికి దాతలు సమర్పించిన పల్లకి

యలమంచిలి: మండలంలోని కొంతేరు శ్రీకుంతీ లక్ష్మీ నరసింహస్వామికి శుక్రవారం దాతలు రూ.60 వేలు విలువైన పల్లకి సమర్పించారు. గ్రామానికి చెందిన నిమ్మకాయల రామారావు జ్ఞాపకార్థం ఆయన కుమారులు నిమ్మకాయల వెంకట దుర్గా ప్రసాద్, నాగ మల్లేశ్వరరావు, మనుమళ్లు రామ స్వామి, నాగార్జున బస్తర్ టేకుతో ఈ పల్లకి తయారు చేయించారు. పల్లకికి ఆలయ అర్చకులు పూలపల్లి వేణునాథ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దాతలకు కార్యనిర్వహణాధికారి మామిడిశెట్టి వీర వెంకట శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ మల్లుల రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మంచెం పుల్లారావు, తోలేటి భీమేశ్వరరావు, మంచెం సుబ్బారావు, అందే వీర రాఘవులు, బేరం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో ముందుకు సాగాలి

పెనుగొండ: కూటమి నేతలు సమన్వయంతో ముందుకు సాగాలని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఆచంట మండలం పెదమల్లం, కోడేరుల్లో పల్లెపల్లెకూ పితాని కార్యక్రమాన్ని నిర్వహించారు. కూటమి నేతల మధ్య అభిప్రాయ భేదాలు ఉన్నా మండల, నియోజకవర్గ సమన్వయ కమిటీతో చర్చించుకుని పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దిగమర్తి సూర్యకుమారి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

గోవుల దొంగలపై కఠిన చర్యలు తీసుకోవాలి


అప్పారావుకు వినతిపత్రం అందిస్తున్న వీహెచ్‌పీ సభ్యురాళ్లు

పాలకొల్లు సెంట్రల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గోవధను నిరోధించాలని అనేక చట్టాలు చేశారని కాని వాటిని కొన్ని చట్ట వ్యతిరేక శక్తులు నిత్యం గోవులను అక్రమంగా రవాణా చేయడం, ఆవులను దొంగిలించడం చేస్తున్నారని విశ్వహిందూ పరిషత్ సభ్యురాలు టి.సునీతాదేవి ఆగ్రహం వ్యక్తంచేశారు. శుక్రవారం పట్టణంలో గోవుల దొంగలను వెంటనే శిక్షించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సునీతదేవి మాట్లాడుతూ రోడ్లపై సంచరించే గోవులను దొంగిలించి తరచూ వధశాలకు తరలిస్తున్నారని అన్నారు. పాలకొల్లు పట్టణంలో ఒక్క మే నెలలోనే 23 ఆవులను దొంగిలించినట్లు తెలుస్తుందన్నారు. గత నెల 27న అర్ధరాత్రి సుమారు 1.30 గంటల సమయంలో పబ్లిక్‌గా వ్యాన్‌పైకి గోవులను ఎక్కించుకుని వెళ్లిపోయినట్లు సీసీ కెమెరాల ఫుటేజీల్లో రికార్డులు ఉన్నాయన్నారు. దీనిపై స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశామన్నారు. పట్టణంలో కూడా గోవధ జరుగుతున్నట్లు మునిసిపల్ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. గతంలో మార్కెట్ యార్డ్ నుంచి 9 లారీలపై ఆవులను తరలిస్తున్న సంఘటన అధికారుల దృష్టికి తెచ్చి వాటిని అప్పగించామన్నారు. అయినా గోవులను తరలిస్తున్న వారిపై ఏవిధమైన చర్యలు తీసుకోలేదన్నారు. ఇంత బహిరంగంగా నడిరోడ్డుపై ఉన్న ఆవులను దొంగిలించుకుని వెళ్లిపోయిన దొంగలను వెంటనే పట్టుకుని వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. స్థానిక శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయం నుండి గాంధీబొమ్మల సెంటర్, బస్టాండ్ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీగా వెళ్లి సీనియర్ అసిస్టెంట్ అప్పారావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయ ఈఓ ముచ్చర్ల శ్రీనివాస్, విశ్వహిందూ పరిషత్ సభ్యులు అఖిల్, గాదె వెంకన్న, గేదెల లక్ష్మణరావు, బిజేపి నాయకులు రావూరి సుధ, కొల్లి కొండప్రసాద్, జక్కంపూడి కుమార్, అంబటి రాజు, నాళం బాబి, విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్, దర్మపరిరక్షణ సమితి సభ్యులు పాల్గొన్నారు.

రాళ్లగుట్టలతో నిత్యం ప్రమాదాలు


పెనుగొండలో ప్రమాదాలకు నిలయంగా మారిన గుట్టలు

పెనుగొండ: వాహనాల రాకపోకలను మళ్లించడానికి వేసిన రాళ్ల గుట్టలు ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. పెనుగొండ మార్టేరు రహదారిలో నెగ్గిపూడి వద్ద కల్వర్టు నిర్మించడానికి, పెనుగొండ ఫ్లైఓవర్ మరమ్మతులకు ఏప్రిల్ నుంచి పెనుగొండ మార్టేరుల మధ్య రాకపోకలను నిలిపివేశారు. వాహనాల మళ్లింపునకు రాళ్ల గుట్టలను రహదారిపై వేశారు. పెనుగొండ బస్టాండు వద్ద, ఫ్లైఓవర్ వద్ద, పెనుగొండ శివారు పెట్రోల్ బంక్ సమీపంలోనూ వీటిని ఏర్పాటు చేశారు. వీటికి అధికారులు హెచ్చరిక బోర్డులు సైతం ఏర్పాటు చేశారు. నెలరోజులుగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా వాహనాల నియంత్రణ జరిగింది. వారం రోజులుగా చిన్నకార్లు, మోటారు సైకిళ్ల రాకపోకలు సాగించడానికి అధికారులు వెసులు బాటు కల్పించారు. వాహనాల రాకపోకలు పెరిగాయి. పగటి పూట ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రయాణాలు సాగుతున్నాయి. అయితే, రాత్రి వేళ మాత్రం నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. మోటార్ సైక్లిస్టులు అదుపు తప్పి పడిపోతూ తీవ్ర గాయాల పాలవుతున్నారు.

అంధకారమే అసలు సమస్యల

కొన్ని రాళ్ల గుట్టల వద్ద అంధకారం నెలకొనడంతో ప్రమాదాలకు నిలయం మారాయి. ముఖ్యంగా పెనుగొండ శివారు పెట్రోలు బంక్ వద్ద పరిస్థితి మరీ దారుణంగా మారింది. సమీపంలో ఎక్కడా విద్యుత్ దీపాలు వెలగక పోవడం, వాహనారుల నిర్లక్ష్యంతో వాహనాలు వేగంగా వచ్చి రాళ్ల గుట్టను ఢీకొంటున్నాయి. ఇప్పటికే పలువురు మోటార్ సైకిలిస్టులు తీవ్ర గాయాల పాలయ్యారు. రెండు కార్లు అయితే ఏకంగా సర్కస్ ఫీట్లు చేశాయి. రాళ్ల గుట్టను గమనించక పోవడంతో వేగంగా రాళ్ల గుట్టను ఢీకొంటూ పైకి లేచి కిందకు పడుతున్నాయి. ఇటీవల ఈ రాళ్లగుట్టల వద్ద మోటార్‌సైకిల్ అదుపు తప్పి పడిపోవడంతో ఓ వ్యక్తి తలకు తీవ్ర గాయాలయ్యాయి. చీకట్లో రాళ్ల గుట్టను గుర్తించకుండా వేగంగా రావడం కారణంగానే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. అయితే మరోవారం రోజుల్లో కల్వర్టు నిర్మాణం పూర్తి కానుండడంతో గుట్టను తొలగిస్తామని అధికారులు చెబుతున్నారు. అయితే ఈలోపు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా అధికారులు రాత్రి వేళ రాళ్ల గుట్ట కనిపించే విధంగా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

13 నుంచి రైతులకు విత్తనాల విక్రయం

పెనుమంట్ర: మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో రైతులకు విత్తనాల అమ్మకం జూన్ 13 నుంచి స్టాక్ ఉన్నంత వరకు చేస్తామని మార్టేరు వరిపరిశోధనా సంస్థ సహ పరిశోధనా సంచాలకులు డాక్టర్ టి శ్రీనివాస్ శుక్రవారం చెప్పారు. స్టాక్ తక్కువగా ఉన్న రకాలు కిలోప్యాకింగ్ లో మాత్రమే ఇస్తున్నామని, రైతులు బ్రీడర్, ఫౌండేషన్, సర్టిఫైడ్ రకాల విత్తన తరగతుల దిగుబడిలో ఎటువంటి వ్యత్యాసం ఉండదన్నారు. రైతులు కిలో రూ.77.80 ఖరీదు ఉన్న బ్రీడర్ విత్తనం కొనుగోలు చేసి సాగు ఖర్చు పెంచుకోరాదన్నారు. ఈ సందర్భంగా రైతులు వ్యవసాయ శాఖ వారి గ్రామీణ విత్తనోత్పత్తి పథకాన్ని, ఏరువాక మరియు ఇతర విస్తరణ కేంద్రాల సహకారంతో రైతు స్థాయిలోనే విత్తనం తయారు చేసుకుని సాగు ఖర్చు తగ్గించుకోవాలని కోరారు. విత్తన అమ్మకాలు కేవలం కార్యాలయం పని దినాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి పదకొండు గంటల వరకు, మధ్యాహ్నం రెండు గంటల నుంచి నాలు గంటల వరకు ఉంటాయని వివరించారు. ఆన్‌లైన్ పేమెంట్ సౌకర్యం కూడా ఉందని పేర్కొన్నారు. గ్రామం లేదా మండలం రైతులందరూ కలిసి 50 బస్తాల కన్నా ఎక్కువ కొనుగోలు చేస్తే ట్రాన్స్‌పోర్ట్ ద్వారా వారి ప్రాంతాలకే విత్తనం పంపుతామన్నారు. ద్రవీకరణ విత్తనం ఒకసారి తీసుకుంటే ఆ విత్తనాన్ని మూడు పంటల వరకు వాడుకోవచ్చని ఆయన చెప్పారు.

చదువుతోపాటు వ్యాయామం ముఖ్యం


కిశోర బాలికలకు వ్యాయామం నేర్పుతున్న అంగన్‌వాడీ సిబ్బంది

యలమంచిలి: చదువు జీవితానికి సార్ధకత చేకూరిస్తే వ్యాయామం శరీరానికి ఆరోగ్యాన్ని ఇస్తుందని మహిళా పోలీసు టి.స్నేహ చెప్పారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన కిశోర వికాస కార్యక్రమంలో ఆమె శారీరక వ్యాయామం, ఆటపాటల ప్రాముఖ్యత గురించి యువతులకు వివరించారు. క్రమం తప్పకుండా శారీరిక వ్యాయామం, యోగా అభ్యసిస్తే ఆరోగ్యం బాగుండి చదువు మీద శ్రద్ధ చూపించగలుగుతారన్నారు. ప్రతి యువతి ఈ విషయాన్ని తెలుసుకుని వ్యాయామం, యోగ గురించి తల్లిదండ్రులు కూడా చెప్పాలన్నారు. చదువుతోపాటు ఆటపాటల మీద కూడా శ్రద్ధ వహించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం.మహాలక్ష్మీ, దివి లక్ష్మీ, ఎస్.రమాదేవి, కె.రజిని, ఎల్.జ్యోతి, ఎం.సువర్ణ పాల్గొన్నారు.

ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ తనిఖీ


ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను తనిఖీ చేస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ జి.గీతాభాయి

నరసాపురం రూరల్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ జి.గీతాబాయి శుక్రవారం నరసాపురం మండలంలోని కె.బేతపూడి గ్రామంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి పరిసరాలను, రికార్డులను పరిశీలించారు. క్యాన్సర్ తదితర రోగ నిర్ధారణ (ఎన్‌సిడిసీడీ) పరీక్షలకు సంబంధించిన సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. సర్వే జరుగుతున్న తీరును ఆన్‌లైన్ రికార్డులను పరిశీలించారు. సంక్రమిత, అసంక్రమిత వ్యాధుల మీద ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీల్లో ఆమె వెంట ఎంఎల్‌హెచ్‌పీ యెన్నాబత్తుల కల్పన, ఏఎన్ఎం సాకా చరిత తదితరులు ఉన్నారు.

సరిహద్దు తగాదాలో ఇరు వర్గాలపై కేసు

యలమంచిలి: శిరగాలపల్లి గ్రామంలోని హరిజనపేటలో సరిహద్దు తగాదా నేపథ్యంలో పక్క పక్క ఇళ్లలోని వారు గురువారం రాత్రి ఒకరిపై ఒకరు చేయి చేసుకున్నారు. ఇరువర్గాల్లోను ముగ్గురేసి వ్యక్తులకు గాయాలు కావడంతో పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు శుక్రవారం ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు ఇరు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ శాంసన్ రాజు తెలిపారు.

అనారోగ్య బాధితులకు సాయం


బాధితులకు మందులు అందిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: మండలంలోని పెదమామిడిపల్లి గ్రామానికి చెందిన ముగ్గురు అనారోగ్య బాధితులకు వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో రూ.23 వేలు విలువ చేసే మందులు అందజేశారు. శుక్రవారం గ్రామంలోని బాధితుల ఇంటికి వెళ్లి మందులు అందించినట్లు క్లబ్ అధ్యక్షులు తటవర్తి సుధాకరరావు తెలిపారు. ఈ సందర్భంగా సుధాకరరావు మాట్లాడుతూ విద్యా వైద్య పరంగా ఎవరైనా ఇబ్బందులు పడితే వారికి వాకర్స్ క్లబ్ తన వంతు సహాయ సహకారాలు అందిస్తుందని అన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పీర్ సాహెబ్, పోతుల ఉమాశంకరరావు, మానెం బసవరాజు, ధనాని శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

రోగులకు వసుధ ఫౌండేషన్ సాయం


చెక్కులు అందిస్తున్న గాంధీరాజు

పాలకొల్లు సెంట్రల్: పేద ప్రజలను కష్టాల్లో ఆదుకుంటూ వసుధ ఫౌండేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమని కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ అధ్యక్షులు గొట్టుముక్కల గాంధీభగవాన్‌రాజు అన్నారు. శుక్రవారం స్థానిక స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట రామరాజు పంపిన చెక్కులను గాంధీరాజు ఐదుగురు అనారోగ్య బాధితులకు ఒక్కొక్కరికి రూ. 10 వేల చొప్పున చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బుద్దరాజు, డాక్టర్ కెఎస్‌పిఎస్ వర్మ,కోసూరి సుబ్బరాజు, చెరుకూరి సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): సమష్టికృషితో దోమల వ్యాప్తిని అరికడదామని సబ్ యూనిట్ అధికారి వై.వీ.లక్ష్మణరావు పేర్కొన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమాలలో భాగంగా పట్టణ ఆరోగ్య కేంద్రం పదోవ క్లస్టర్‌లో డ్రై డే, వెక్టార్ కంట్రోల్ హైజీన్, మలేరియా నివారణ కార్యక్రమాలు జరిగాయి. ఆరోగ్య అవగాహన ర్యాలీ నిర్వహించారు. వారానికి ఒక్కసారి తప్పక పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. దోమ లార్వాలను నివారించేందుకు సమిష్టికృషి ఎంతో అవసరమని చెప్పారు. పరిసరాలు, ఇళ్లలోను నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు, లక్ష్మీకళా, లక్ష్మీకుమారి, ఆరోగ్య సహాయకులు కాంతారావు, కిలారీ సాయిబాబు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

Smt Kola Vimala, W/o. Lakshman, D.No. 3-212, Rustumbadha, Narasapur Mandal, West Godavari Dist. for loan from my client M/s. SHRIRAM FINANCE LTD., Chennai having branch at Narasapur on the security of the property of Smt.Kola Vimala, W/o. Lakshman, D.No. 3-212, Rustumbadha, Narasapur Mandal, West Godavari Dist. If anybody having objections or attachments over the property should inform to the undersigned within three days from this day.

SCHEDULE: West Godavari District, Narasapur Mandal, Narsapur Sub Registrar, Rustumbadha Village a vacant site at nearest D No.3-166 in an extent of 1790.8 sq yards in R.S.No 49/1, situated at Rustumbadha Village within the following boundaries. East: 9 feet joint way, West: Site of Injeti Rajeswari, samarthapattapu Karakadurga; North: site of Koparthi Bindhu; South: Road

P.D.S.V.BALAJI, Advocate, PALAKOL

గోవులకు గరుకు స్తంభాల ఏర్పాటు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక కాపు వనిత సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో గోవుల కోసం గరుకు స్థంభాలు ఏర్పాటుచేశారు. శుక్రవారం పట్టణంలో ఆరు స్థంబాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి నిమ్మల రామానాయుడు దాతలను అభినందించారు. క్లబ్ అధ్యక్షురాలు యామన విజయలక్ష్మీ మాట్లాడుతూ ఆరుగురు దాతల ద్వారా పట్టణంలో ఈ గరుకు స్థంబాలు ఏర్పాటుచేశామన్నారు. కాపు క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ ముచ్చర్ల సంజయ్, గవర్నర్ పెనుమాక రామ్మోహన, ప్రెసిడెంట్ జక్కంపూడి మథన్, మద్దాల వాసు, కఠారి నాగేంద్ర, పోకల రాము, జక్కంపూడి కుమార్ పాల్గొన్నారు.

సిద్ధాంతంలో ఉచిత వైద్య శిబిరం


సిద్ధాంతం కచేరీ వద్ద ఉచిత వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

పెనుగొండ: సిద్ధాంతం సొసైటీ, కచేరీల వద్ద, వడలి పంచాయతీ వద్ద మేడ్ యునైటెడ్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ సుమారు 420 మందికి ఉచితం పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పాలకొల్లు, ఆచంట నియోజకవర్గాల్లో ఇప్పటి వరకూ 5 వేల మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించామని నిర్వాహకులు తెలిపారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

నరసాపురం డివిజన్
90102 23729 (పాలకొల్లు)
81869 95956 (నరసాపురం)
90102 23729 (ఆచంట)

Office mail : tpgadvt@gmail.com